క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య కోరారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు అందించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలని, పెన్షన్‌ను ప్రతి నెలా ఒకటవ తేదీనే ఇవ్వాలని వారు కోరారు. వినతి అందించిన వారిలో జిల్లా కోశాధికారి డీ.కే.శర్మ, ఉపాధ్యక్షుడు టి.జనార్దన్‌రావు, నగర అధ్యక్షుడు మారం రాజు రాధాకృష్ణారావు, కె.హనుమంతరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మామిళ్లగూడెంలో పోషణ మాసోత్సవం



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బురహాన్‌పురం సెక్టారు మామిళ్లగూడం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్స్ మీటింగ్‌ను ఏర్పాటు చేసి పోషణ మాసం ప్రాధాన్యతను మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలియజేశారు. మహిళా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాలు, ఆరోగ్యలక్ష్మి, సమతుల ఆహారం తదితర అంశాల గురించి, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధాభవాని, ఏఎన్‌ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు రహీమున్నిస్సా బేగం, సరస్వతి, వహిదా బేగం, రమణ, రజియా బేగం, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని కోరుతూ చేపట్టిన ఎమ్మార్పీఎస్ దీక్షలు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. కాగా, ఈ దీక్షలను సంఘం జిల్లా నాయకుడు తోళ్ల వెంకన్న ప్రారంభించి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా కాలయాపన చేసి తీవ్ర జాప్యం చేశారని, ఇకనైనా జాప్యాన్ని వీడి వెంటనే సమావేశాల్లోనే ఆమోదించేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్టపింజర బాల స్వామి, హనుమంతరావు, కరుణాకర్, హుస్సేన్, రవికిరణ్, నారాయణ, వెంకటరత్నం, రాములు తదితరులు పాల్గొన్నారు. కాగా, వీరికి పలు పార్టీలకు చెందిన నాయకులు సంఘీభావం ప్రకటించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ ఆంటోని
వినోద	జవాన్(హిందీ), జైలర్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	చాంగురే బంగారు రాజా
శ్రీనివాస	జవాన్
సుందర్	ఖుషి

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	5
వంకాయ	40		20
బెండకాయ	18	పాలకూర	4
పచ్చిమిర్చి	40		20
కాకర	30	చుక్కకూర	4
బోడ కాకర	110		20
బీర	40	తోటకూర	5
దొండ	18		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	50		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	4
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	46	-ఖమ్మం వ్యవసాయం	

'గృహలక్ష్మి'తో సొంతింటి కల సాకారం

- వలస పక్షులు వచ్చి పోతాయే తప్ప ప్రజలను పట్టించుకోవు
- ఖమ్మం చరిత్రలోనే ఇన్ని ఇళ్లు ఎప్పుడూ ఇవ్వలేదు
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేత



లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేందుకే తెలంగాణ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో ఖమ్మం కార్పొరేషన్‌లోని 2, 3, 4, 8, 26వ డివిజన్లు, రఘునాథపాలెం మండలం బూడిదంపాడు, ఈర్లపుడి గ్రామాల లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం ఉత్తర్వులను మంత్రి అందజేసి, కార్యక్రమాన్ని జిల్లాలో లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అదనంగా గృహలక్ష్మి పథకం కింద సొంత స్థలం ఉన్న వారికి తమ సొంతింటి కలను నెరవేర్చామని అన్నారు. ఇప్పటికే వైఎస్సార్‌నగర్‌లో 230 ఇళ్లు, టేకులపల్లిలో 2 వేల ఇళ్లు ఒకే సముదాయంలో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో అద్భుతంగా ఇళ్లు నిర్మించి ఇచ్చామని పేర్కొన్నారు. రామన్నపేట, వైఎస్సార్‌నగర్, అల్లిపురంలలో నిర్మాణం జరుగుతున్నాయని వాటికి కూడా అర్హులైన పేదలకు పూర్తి పారదర్శకంగా అందిస్తామని వెల్లడించారు. ఈ నాలుగేళ్లలో నగరంలో 5 వేల మందికి ఇళ్లు నిర్మించామని, 4 వేల మందికి జీఓ నం.58 ద్వారా ఇళ్లకు పట్టాలు ఇచ్చామని అన్నారు. ఈ పథకం ద్వారా నిర్మాణ రంగంలో ఉద్యోగాలను సృష్టించడం ద్వారా పేదలకు పనులు పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కూడా మెరుగుపరుచుకోవచ్చని మంత్రి తెలిపారు.

4 వేల దరఖాస్తులు రాక..

ఖమ్మం నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకానికి మొత్తం 4 వేల దరఖాస్తులు రాగా ప్రస్తుతం మొదటి విడతగా 2వేల ఇళ్లకు మంజూరు పత్రాలు అందిస్తున్నామని, రెండో విడతలో మిగిలిన 2వేల ఇళ్లను అందిస్తామని, ఎవరూ అధైర్య పడొద్దని చెప్పారు. వలస పక్షులు వచ్చిపోతుంటాయని, అవి ఇక్కడ ప్రజలకు ఏమి చేయవన్నారు. ఖమ్మం చరిత్రలో ఇన్ని వేల ఇళ్లను ఏ ప్రభుత్వం ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జేబులు నింపుకున్నారే తప్ప లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ.. గతంలో ఇళ్ల స్థలాలు అసైన్డ్ చేసినట్లు, 3 వేల మందికి జీఓ 58 కింద పట్టాలు అందజేసినట్లు తెలిపారు. మంజూరు పత్రాలు పొందిన వారు మంచిరోజు చూసుకొని వెంటనే పనులు ప్రారంభించాలని, బేస్‌మెంట్ వరకు రూ.లక్ష, రూఫ్ లెవల్ వరకు మరో రూ.లక్ష, పూర్తయిన తర్వాత మిగిలిన రూ.లక్ష గృహలక్ష్మి కింద అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీఓ జి.గణేష్, తహసీల్దార్ స్వామి, రఘునాథపాలెం ఎంపీపీ గౌరీ, జెడ్పీటీసీ ప్రియాంక, ఖమ్మం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, సహాయ కమిషనర్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

నగరంలోని 11, 47వ డివిజన్‌లలో రూ.2 కోట్లతో సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 కోట్లు కేవలం సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్ల కోసమే వినియోగించామన్నారు. మంత్రిగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యాన మంత్రి కేటీఆర్ రూ.100 కోట్లు నిధులు కేఎంసీకి ఇప్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్ సరిపుడి రమాదేవి సతీష్, మాటేటి లక్ష్మి నాగేశ్వరరావు, పసుమర్తి రాంమోహన్, ఆర్‌జేసీ కృష్ణ, మాటేటి రామారావు, కన్నం ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకుంటాం..



గృహలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం అందజేసే రూ.3 లక్షలతో ఇల్లు కట్టుకుంటాం. మాకు ఇళ్లు లేదు. ప్రభుత్వం అందజేసే సాయంతో రెండు గదుల ఇళ్లు కట్టుకుంటాం. నిధులు మంజూరైన ఉత్తర్వులు అందించడం సంతోషంగా ఉంది.

– మలోతు వీరమ్మ, ఈర్లపూడి, రఘునాథపాలెం

సొంతింటి కల నెరవేరుతుంది..



సొంతిల్లు కట్టుకోవాలని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇంటి నిర్మాణానికి డబ్బులు లేక ఇబ్బందులు పడ్డాం. ఈ పథకం కింద ప్రభుత్వం అందజేసే నగదుతో ఇల్లు కట్టుకొని మా సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నాం.

– పూరే అమల, 8వ డివిజన్, కేఎంసీ

సంతోషంగా ఉంది..



ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయానికి సంబంధించి ఉత్తర్వులు అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం అందజేసే ఈ సాయం మరచిపోలేనిది. ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించి ప్రభుత్వం నుంచి సాయం పొందుతాను.

– జింకల సుమతి, 26వ డివిజన్, కేఎంసీ

'గృహలక్ష్మి'లో అనర్హులను ఎంపిక చేశారని రాస్తారోకో..



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న బూడిదంపాడు గ్రామస్తులు

రఘునాథపాలెం: గృహలక్ష్మి పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అనర్హులను ఎంపిక చేసారని ఆరోపిస్తూ శుక్రవారం బూడిదంపాడు గ్రామస్తులు ఇల్లెందు – ఖమ్మం ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమ గ్రామంలో 47 మందిని ఎంపిక చేయడం మంచిదే అయినా సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్న వారిని కాదని అనర్హులకు, ఒకే కుటుంబంలో ముగ్గురికి ఇవ్వడం ఎంతవరకు సమంజసం అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ఏ విధంగా లబ్ధిదారులను ఎంపిక చేశారో చెప్పాలన్నారు. రహదారిపై ఆందోళన చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించగా..విషయం తెలుసుకున్న రఘునాథపాలెం ఎస్‌ఐ కొండలరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి.. ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మంద వెంకటేశ్వర్లు, ఉమా రాణి, గంధం పావని తదితరులు పాల్గొన్నారు.

'విజయభేరి'కి తరలిరావాలి



మాట్లాడుతున్న ముప్వా విజయ్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్/కామేపల్లి/కూసుమంచి: ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విజయభేరి సభకు భారీగా తరలివెళ్లి సోనియమ్మకు నీరాజనం పలికి ఖమ్మం సత్తా చాటుదామని తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ముప్వా విజయ్‌బాబు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, విజయభేరీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండేటి మల్ల య్య పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాల్లో భాగంగా విజయభేరి సభకు భారీగా తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. శుక్రవారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముప్వా విజయ్‌బాబు, కూసుమంచిలో సమీక్షా సమావేశంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావుతో కలిసి కొండేటి మల్లయ్య మాట్లాడగా.. రాంరెడ్డి గోపాల్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. రాహుల్ గాంధీ చేవెళ్ల సభలో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షులు మట్టి గురవయ్య, ఎండీ ముస్తఫా, కొప్పెర ఉపేందర్, రామ్మూర్తి, తమ్మిన్ని నాగేశ్వరరావు, మియాభాయ్, ఇమామ్, నగర ఓబీసీ సెల్ చైర్మన్ బాణాల లక్ష్మణ్, ఎంపీటీసీ అశోక్, నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి, కొరివి వెంకటరత్నం, బొడ్డు బొందయ్య, ఎండీ హఫీజుద్దీన్, వాసు, వెంకన్న, సత్యనారాయణరెడ్డి, లచ్చానాయక్ తదితరులు ఉన్నారు.

సమ్మె కాలం వేతనాలు ఇప్పించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

నేలకొండపల్లి: పంచాయతీ కార్మికులకు సమ్మె కాలం వేతనాలు ఇప్పించాలని పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు వంగూరి నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ కె.జమలారెడ్డికి కార్మికులు అందించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ.. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని సమ్మె చేసినా ఎవ్వరినీ ఇబ్బంది పెట్టలేదని, ప్రభుత్వ పెద్దలపై నమ్మకంతో తిరిగి విధుల్లో చేరినట్లు తెలిపారు. కానీ సమ్మె కాలం వేతనాల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని వేతనాలు అందించడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రహిముతుల్లా, ఆంజనేయులు, బుచ్చిరాములు, అనిత, వెంకటేశ్వర్లు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించే సభకు తిరుమలాయపాలెం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు షేక్ బషీరుద్దీన్ తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో గజ్జల వెంకటయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం సాయంత్రం 4 గంటల తిరుమలాయపాలెం మండల కేంద్రం నుంచి కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు, సురేష్, నాగేశ్వరరావు, మహేందర్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ మహాసభలను..

ఖమ్మంరాపర్తినగర్: బీహార్ రాష్ట్రంలో ఈనెల 28 నుంచి జరగనున్న ఏఐఎస్‌ఎఫ్ 30వ జాతీయ మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం ఆయన మహాసభల పోస్టర్లు ఆవిష్కరించాక మాట్లాడారు. విద్యార్థులను సామ్రాజ్యవాదులకు బానిసలుగా తయారు చేస్తున్న పాలకులపై పోరాట కార్యాచరణను ఈ సభల్లో రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, శివ, చందులాల్, ఆకాష్, రాకేష్, సంతోష్, సతీష్, ఉమ, గోపి, నరేష్, పూర్ణచంద్రరావు, మహేష్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మేడే కానుక అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మం వన్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వం సఫాయన్న సలాం అంటూ మేడే కానుకగా ప్రకటించిన రూ.1,000లను వెంటనే అందించాలని తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గండమల్ల రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు వారి జీతాలను క్రమం తప్పకుండా తీసుకుంటారే తప్ప, ప్రజల ఆరోగ్యాలు కాపాడుతూ పట్టణాలను శుభ్రంగా ఉంచుతున్న కార్మికులను మాత్రం పట్టించుకోరని విమర్శించారు. పెరిగిన ధరలకు తమ జీతాలు సరిపోక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రకటించిన మేడే కానుకను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి తొమ్మిదేళ్లు దాటినా నేటికి అతిగతిలేదన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్, నాయకులు డి.గురవయ్య, జె.గురవయ్య,వీరబాబు, నారాయణ, ధర్మయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మం అర్బన్/ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంతో పాటు అర్బన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లలో లైన్ క్లియరెన్స్ పనుల నిమిత్తం నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఖానాపురం సబ్‌స్టేషన్ 33 కేవీలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు శ్రీనగర్ కాలనీ, వైరా రోడ్డు, ఇందిరానగర్, రోటరీనగర్, పోలీస్ కాలనీ, గోపాలపురం, పుట్టకోట, గొల్లగూడెం, కొత్తగూడెం ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అశోక్ తెలిపారు. అలాగే నగరంలోని టౌన్-5 సెక్షన్ 11 కేవీ జమ్మిబండ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సీక్వెల్ ఏరియా, జెడ్పీ క్వార్టర్స్ ఏరియా, సెంచరీ స్కూల్ ప్రాంతం, జమ్మిబండ, ఆదిత్య థియేటర్ ప్రాంతం, తుమ్మలగడ్డ మజీదు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ పేర్కొన్నారు. అలాగే నగరంలోని టౌన్-1 గాంధీచౌక్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఖమ్మం అర్బన్ ఎమ్మార్వో ఆఫీస్ రోడ్, సాయిరాం థియేటర్ రోడ్, మోతీనగర్, బొక్కలగడ్డ, పంపింగ్‌వెల్ రోడ్, ఫిల్టర్ బెడ్ రోడ్, ఆటోస్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి, గాంధీ చౌక్, పీఎస్‌ఆర్ రోడ్, సందర్ మ్యాక్స్ థియేటర్ రోడ్, కన్యకా పరమేశ్వరీ దేవాలయం రోడ్, జహీర్‌పుర తండా, వెంకటలక్ష్మి టాకీస్ రోడ్, గాంధీనగర్, కొత్త సీతారాములు రోడ్, సుందరయ్యనగర్, పత్తి మార్కెట్ యార్డు, బోసు బొమ్మ సెంటర్, మంచికంటి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మౌళిక తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేపు విశ్వకర్మ జయంతి

నేలకొండపల్లి: ఈ నెల 17న విశ్వకర్మ జయంతి వేడుకలను వాడవాడలా నిర్వహించాలని సంఘం మండల కన్వీనర్ తుడిమళ్ల ఉపేంద్రచారి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ జయంతి వేడుకల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో గాటి నాగచారి తదితరులు పాల్గొన్నారు.

రేపు సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని జూబ్లీక్లబ్ ఫంక్షన్ హాల్‌లో సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కె.అంజద్ భాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయనీ, గాయకులు ఎస్వీ రమణ, జనార్దన్, ఎండీ జాఫర్, ప్రకాష్, శివ లీల, నాగస్వర్ణశ్రీ, కృష్ణ శబరి, సింధుభైరవిలు పాల్గొంటారని తెలిపారు. కళాభిమానులు, కళా పోషకులు పాల్గొని గాన మాధురి సినీ మధుర గీతాలను ఆదరించాలని కోరారు.

కేఎండీసీలో సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల(కేఎండీసీ)లో శుక్రవారం మెడికల్ కోడింగ్ అనే అంశంపై సదస్సును నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్, ఐక్యూఏసీ ఆధ్వర్యాన ఈ సదస్సు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే.వీ.రమణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

19లోగా ఓటరు నమోదు చేసుకోవాలి

నేలకొండపల్లి: ఈ నెల 19లోగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నట్లు నేలకొండపల్లి తహసీల్దార్ ఎస్.శ్వేత తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తుది జాబితా రూపొందించడంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండాలని తెలిపారు. బీఎల్‌వోలు విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్పులు, చేర్పులకు అవకాశం ఉన్నందున్న వెంటనే పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని తమ పేర్లను సరి చూసుకోవాలని ఓటర్లకు సూచించారు.

ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించుకోవాలి



గరిడేపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కామేపల్లి: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని ముచ్చర్ల, జాస్తిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, గరిడేపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గుడిపూడి శ్రీనివాసరావులు అన్నారు. శుక్రవారం మండలంలోని ముచ్చర్ల, జాస్తిపల్లి, గరిడేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈమేరకు విద్యార్థులకు ప్రజాస్వామ్యం, చట్టాలు, బాలల హక్కులు, పోలింగ్ విధానం, ఓటరు స్లిప్ పంపిణీ, ఎన్నికల అధికారుల విధులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌జీసీ కన్వీనర్ పెసర ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి ఈర్యా, రఘుకుమార్, నాగిరెడ్డి, దేవ్‌సింగ్, మురళీకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్, పద్మ, స్వర్ణలత, గంగ, ప్రసాద్, కృష్ణ, బాబురావు, రాజశేఖర్, కబీర్‌దాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ వేతన సవరణను పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ విలీనం కంటే ముందే 2017– 2021 సంబంధించిన వేతన సవరణను పరిష్కరించాలని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ జేఏసీ చైర్మన్ పాటి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం 2013కు సంబంధించిన 50 శాతం బాండ్ డబ్బులు చెల్లించాలని, తమకు రావాల్సిన రెండు డీఏలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం డిపో ఎదుట ధర్నా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతేకాక ఎరియర్స్, పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ, సీసీఎస్‌లకు జమచేయాలన్సన బకాయిలను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ విలీన కమిటీలో ఆర్టీసీ యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని పేర్కొన్నారు. ఖమ్మం డిపో జేఏసీ చైర్మన్ గుడిబోయిన శ్రీనివాసరావు, కన్వీనర్లు సీతారామయ్య, బేతంపుడి బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రత్నం, వెంకటేశ్వర్లు, వెంకన్న, జరీనాబేగం, నాగలక్ష్మి, శోభారాణి, రాజమణి, రాధా సైదమ్మ, భాగ్యలక్ష్మి, కల్యాణి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వింటా బియ్యం అందజేత

కామేపల్లి: ముచ్చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు దాసరి శ్రీను తల్లి సరస్వతి ఇటీవల మృతి చెందగా.. శుక్రవారం బాధిత కుటుంబానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్‌లు క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, సిరిపురపు రవి, దాసరి రమణ, గాడిపల్లి నరసయ్య, ఆలోతు మోహన్, షంషుద్దీన్ తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

ఖమ్మం అర్బన్: స్థానిక వెలుగుమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని పి.జాగృతికి పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్న క్రమంలో సామినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు సామినేని రవి దృష్టికి తీసుకెళ్లగా ఆయన విద్యార్థినికి శుక్రవారం సైకిల్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కూరాకుల వలరాజు, పాఠశాల హెచ్‌ఎం ఎ.ప్రమీల, శైలజ, ఉదయలక్ష్మి, రవి కిరణ్, రాంప్రసాద్, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



ఎస్‌బీఐటీలో నివాళులర్పిస్తున్న చైర్మన్ కృష్ణ



ఖమ్మం స్పోర్ట్స్: కవిత డిగ్రీ కళాశాలలో..

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంరూరల్/ఖమ్మంస్పోర్ట్స్: నగరంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో చైర్మన్ గుండాల కృష్ణ, కవిత డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన, ఖమ్మంరూరల్ మండలం కొత్తూరులో ఖమ్మం వాసి, చంద్రయాన్-3 ల్యాండింగ్ స్పేస్ ఆపరేషన్ మేనేజర్ వల్లూరు ఉమామహేశ్వరరావు, ఖమ్మం రూరల్ మండలం పెదతండాలోని ప్రియదర్శిని కళాశాలలో కళాశాల చైర్మన్ కె. నవీన్‌బాబు, లు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంజనీర్స్ డే ప్రాధాన్యతను పలువురు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.